క్లుప్తంగా

రక్తదానం చేయండి

తెనాలిఅర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రసన్న పేర్కొన్నారు. నేషనల్ వలంటరీ బ్లడ్ డోనేషన్ డే సందర్భంగా జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం పలువురు రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీబీయూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది బాపనయ్య, రమాదేవి, శ్యామల పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కొల్లిపర: 60 సంవత్సరాలు పై బడిన ప్రతి ఒక్కరూ దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మి సుధ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని తూములూరు గ్రామంలో వృద్ధులకు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగాంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించి, దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం గురించి వివరించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పింపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌పి సి.హెచ్.భారతి, ఎఎన్ఎం డి.రత్నవాసంతి, 108 సిబ్బంది కోటిరెడ్డి, ఆషా వర్కర్స్‌లు, వృద్ధులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు సక్రమంగా చేయండి

తెనాలిఅర్బన్: వ్యాధి నిర్ధారణ పరీక్షలను సక్రమంగా చేయాలని తెనాలి సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ సూచించారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్‌లతో పాత ప్రభుత్వ వైద్యశాలలోని సహాయ మలేరియా అధికారి కార్యాలయంలో మంగళవారం సమీక్ష జరిపారు. రక్తపూతల నమూనా సేకరణలో తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సూపర్‌వైజర్ బండారు మల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ షేక్ నవీద్, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



కొల్లిపర: విధి నిర్వహణలో ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు తప్పని సరిగా గుర్తింపు లభిస్తుందని, అటువంటి వారిలో మండల పర్యవేక్షణ అధికారి చంద్రమోహన్, ఇవోపిఆర్డీ పూర్ణశంకరరావు ఒకరని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న చంద్రమోహన్, పూర్ణశంకరరావు మంగళవారం బదిలీపై వెళుతున్న సందర్భంగా అధికారులు వారిని సత్కరించే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు సిద్ధార్ధ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ రాజ్, రెవెన్యూ సిబ్బంది వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలను అందించారు.

పరదా పట్టాల పంపిణీ



తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం రూరల్ మండల గ్రామం కొలకలూరులో నివసిస్తున్న 10 కుటుంబాలకు, యడ్ల లింగయ్య కాలనీ రైల్వే ట్రాక్ పక్కన నివసిస్తున్న 30 కుటుంబాలకు పరదా పట్టాలను అందజేశారు. వర్షాలకు ఇబ్బంది పడుతున్న వేస్ట్ పికర్స్ కుటుంబాలకు ఇంటి పైకప్పుపై వాడుకునేందుకు ఉపయోగంగా ఉంటుందన్న దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లాడి దేవ కుమార్ ఆలోచనతో వీటిని అందజేశారు. పట్టాలతో పైకప్పులు వేసుకోవడం ద్వారా కుటుంబసభ్యులంతా నివాసాల్లో ప్రశాంతంగా పడుకోవచ్చని సూచంచారు. కో–ఆర్డినేటర్ ఆమని మాట్లాడుతూ వేడి భోజనం తినాలని, చుట్టుపక్కల శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సంస్థ సిటీ కో–ఆర్డినేటర్లు రమేష్, రాజశేఖర్, రవితేజ, ఆమని, హేవీల పాల్గొన్నారు.

దారిచూపే దీప స్తంభాలు వృద్ధులు

- మా నాయనమ్మే నిదర్శనం
- ఈరోజు జీవించి ఉంటే ఎంతో సంతోషించే వారు
- అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవంలో తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ



రాజారావును సత్కరిస్తున్న సంజనా సింహ, కేవీ గోపాలకృష్ణ

తెనాలి: పెద్దలనగానే పరిగణనలోకి తీసుకోవాల్సింది.. వయసనే నంబరు కాదు.. పెద్దరికం. అనుభవంతో పొందిన జ్ఞానాన్ని తర్వాత తరాలకు విజ్ఞానంగా ఇచ్చేవారు...ఇంట్లో పెద్దవాళ్లుంటే కుటుంబానికి ధైర్యమని, అంతా కలిసుంటే ఎంతో బాగుంటుందని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సబ్‌కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ పెద్దలుంటే భార్యాభర్తల మధ్య తగవులను సర్దుబాటు చేస్తారు...పిల్లలకు ఎలా ఎదగాలో నేర్పిస్తారని చెబుతూ అందుకు తన నాయనమ్మ ఉప్పల పద్మ గొప్ప నిదర్శనంగా చెప్పారు.

తన తండ్రిని పెంచి, పెళ్లయ్యాక బ్యాంకు ఉద్యోగిని అయిన తన తల్లిని పదోన్నతి పరీక్షలకు ప్రోత్సహించి, పదోన్నతితో సూరత్‌కు బదిలీ వస్తే తల్లితోపాటు అక్కడకు వచ్చి చిన్న బిడ్డలైన తమను చూసుకుందని గుర్తుచేసుకున్నారు. చిన్నతనంలో చలివేస్తుందంటే సాయంత్రాని కల్లా స్వెటర్ చేసిచ్చిందనీ, ఇప్పటికీ అది తన దగ్గర ఉందన్నారు. 60 ఏళ్ల వయసులో కిడ్నీ ఫెయిల్యూర్‌తో 2005లో చనిపోయారని చెబుతూ, అమె జీవించి ఉన్నట్టయితే ఈరోజు తనను చూసి ఎంతో సంతోషించే వారని చెప్పుకున్నారు. వృద్ధులంటే కుటుంబానికి దారి చూపే దీపస్తంభాలుగా చెప్పారు. నేటితరంలో నేను, నాకేమిటి? అనే ధోరణి పెరుగుతూ, కుటుంబం, సమాజం అనే భావన తగ్గుతోందని చెప్పారు. సోషల్‌మీడియాలో గడుపుతూ సమయాన్ని వృధా చేస్తున్నారని చెప్పారు. వృద్ధుల కు తాము ఎంతో చేయాలంటూ ప్రభుత్వం తరపున ఆరోగ్య సేవలను అందిస్తామని, పింఛన్లు రాకున్నా, సీనియర్ సిటిజన్స్ చట్టం అవసరమైనా సహకరిస్తామని చెప్పారు.

అలాగే పెద్దవాళ్లకు ఏం కావాలి? ఏం తినాలి? అనే అంశాలపై బిడ్డలు నిర్ణయాలు తీసుకోవటం కూడా కరెక్ట్ కాదన్నారు. మండల తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ, వృద్ధుల సమస్యల పరిష్కారం తమ బాధ్యతగా చెప్పారు. 104 ఏళ్ల రావులపల్లి రాజారావును సబ్‌కలెక్టర్ సంజనా సింహ సత్కరించారు. సంస్థ సభ్యుల్లో సహస్ర పూర్ణ చంద్ర దర్శనాలు చేసుకున్న 8 మంది, 75 ఏళ్లు నిండిన 12 మందిని తహసీల్దారు కేవీ గోపాలకృష్ణచే సత్కరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి సంస్థ తరపున రూ.50 వేల చెక్కును సబ్‌కలెక్టర్‌కు అందజేశారు. కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, సంస్థ వ్యవస్థాపకుడు వుయ్యూరు రాజేంద్రప్రసాద్, కొసరాజు వెంకట్రావు, చలమయ్య, రామ్మూర్తి, కోటయ్య, ఈశ్వర్‌చంద్, మానవత చైర్మన్ ఓంకార్ ప్రసాద్, ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, హనుమారెడ్డి, నాగేంద్రయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

రేపటి నుంచి దసరా శరన్నవరాత్రులు



ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరణ

తెనాలి: స్థానిక దేవీచౌక్‌లో గల శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల బ్రోచర్‌ను మంగళ వారం ఆవిష్కరించారు. ఈనెల 3వ తేదీనుంచి 13వ తేదీవరకు జరిగే ఉత్సవాల వివరాలను తెలియజేశారు. తొలిరోజున ఉదయం ఏడు గంటలకు మంగళవాయిద్యాలతో కలశస్థపన జరుగుతుందనీ, అమ్మవారు పదిరోజులు పది అవతారాలుగా భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 9వ తేదీన మధ్యాహ్నం ఒంటిగంటకు సువాసినులచే లక్ష కుంకుమార్చన, 12వ తేదీ సాయంత్రం కలశోద్వాసన, శమీపజ, అనంతరం రాత్రికి అమ్మవారి రథోత్సవం జరుగుతుందని దేవస్థానం అధ్యక్షుడు టీవీఎస్ శాస్త్రి చెప్పారు. కోశాధికారి దారా బాలకృష్ణ మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం ఏడు గంటలకు బాలపూజ, మధ్యాహ్నం ఒంటిగంటకు శ్రీచక్ర అర్చన, రాత్రి ఏడు గంటలకు అమృత ప్రసాద వినియోగం, 13వ తేదీ ఉదయం సత్యనారాయణ వ్రతం, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటాయని వివరించారు. భక్తులంతా ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి, ఉపాధ్యక్షుడు చివుకుల శివరామప్రసాద్, సహాయకార్యదర్శి, సభ్యులు జొన్నలగడ్డ సూర్యభగవాన్, పోలేపెద్ది రామకృష్ణ, పూర్ణభాస్కర్, కాజా శివప్రసాద్, కొండపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఇచ్చేందుకు చర్యలు

మంత్రి నాదెండ్ల మనోహర్



వికలాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికి నవంబర్‌లో పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి మండల పరిధిలోని కంచర్లపాలెం, సోమసుందరపాలెం, తేలప్రోలు, పట్టణ పరిధిలోని 21, 22, 24, 25 వార్డులలోని లబ్దిదారుల ఇళ్ళకు మంగళవారం మంత్రి మనోహర్ వెళ్ళి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే ఆ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల నగదును పెంచడం జరిగిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు చెప్పారు. ఇంకా పింఛన్ల కోసం అర్హులు ఎదురు చూస్తున్నారని, వారికి కూడా నవంబర్‌లో అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, తహసీల్దార్ గోపాలకృష్ణ, కౌన్సిలర్ సయ్యద్ ఖలేదా నసీమ్, దాసరి వీరవసంతరావు, కొమరబత్తిన జయపాల్, పలువురు అధికారులు, జనసేన, టీడీపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, కమిషరన్ శేషన్న, కౌన్సిలర్ రత్నకుమారి

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 11, 27, 38 వార్డుల్లో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా వార్డులోని రోడ్లు, మురుగు కాల్వలను శుభ్రం చేశారు. మురుగు కాల్వలో స్ప్రెయింగ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వాట్సాప్ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. వాటిని వెంటనే పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కఠారి రత్నకుమారి, బోయపాటి అరుణ, వీర్లపాటి విజయలక్ష్మి, ఏసీపీ సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి హరీష్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు



తెనాలిఅర్బన్: దసరా వేడుకలను గంగానమ్మపేటలోని శ్రీ చైతన్య స్కూల్‌లో మంగలవారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో పాఠశాలకు వచ్చి దుర్గాదేవి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాధ మాట్లాడుతూ మహిషాసురుడుఅనే రాక్షసుడుని దుర్గాదేవి యుద్ధం చేసి వదిస్తుందని తెలిపారు. దీనిని అందరూ దసర పండుగగా జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, రీజినల్ ఇన్‌ఛార్జి అప్పాజీ, డీన్ మల్లిఖార్జునరావు, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛతా సేవ' ఆకృతిలో విద్యార్థులు



'స్వచ్ఛతా సేవ' ఆకృతి

తెనాలి: గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో గత పదిరోజులుగా జరుగుతున్న స్వచ్ఛతాసేవలో భాగంగా మంగళవారం విద్యార్థులతో స్వచ్ఛతా సేవ ఆకృతిని ఏర్పాటుచేశారు. 350 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. విద్యార్థులు 'మహాత్మాగాంధీకి జై' అంటూ నినాదాలు చేశారు.

చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్, ఇన్‌ఛార్జి హెచ్ఎం ప్రసూనాదేవి పర్యవేక్షించారు. గాంధీజీని ఆదర్శంగా శుభ్రత, పరిశుభ్రతను పాటించాని పాటించాలని సూచించారు. పీఈటీ శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శతాధిక నాటకకర్త గోపాలరావు చిరస్మరణీయుడు



మాట్లాడుతున్న తన్నీరు శివశంకర్

తెనాలి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకుని అమూల్యమైన నాటకాలను సమాజాలకు అందించి ప్రేక్షకులను చైతన్యానికి దోహదపడిన శతాధిక నాటకకర్త కొడాలి గోపాలరావు చిరస్మరణీయులను పలువురు వక్తలు అన్నారు. రూరల్ మండలం పెదరావూరుకు చెందిన ప్రముఖ నాటక రచయిత కొడాలి గోపాలరావు శతజయంతిని మంగళవారం సాయంత్రం స్థానిక 'ఇస్కఫ్' సమావేశపు హాలులో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు తన్నీరు శివశంకర్ అధ్యక్షత వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, నాటకసంస్థ అధ్యక్షుడు చందు సూర్య ప్రసంగించారు. కొడాలి గోపాలరావు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా పెదరావూరు ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ప్రజానాట్యమండలిపై 1950 ప్రాంతంలో నిషేధం విధించటంతో ఆంధ్ర క్రాంతి థియేటర్‌ను స్థాపించి, స్వయంగా రాసిన నాటకాలను గ్రామగ్రామాన ప్రదర్శింపజేశారని చెప్పారు. పలనాటి యుద్ధం, బంగారు కలలు సహా పలు సినిమాలకు సంభాషణలు సమకూర్చారని వివరించారు. తొలుత గోపాలరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

వృద్ధుల చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది దీపక్‌కుమార్

తెనాలిరూరల్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. చెంచుపేటలోని శబరి వృద్ధాలయంలో జరిగిన సదస్సుకు న్యాయవాది జి.దీపక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తమ ఉన్నతికి కారకులైన తల్లిదండ్రుల పట్ల బిడ్డలు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. దేశంలో పండుటాకులకు కొంత మేర బిడ్డలు, బంధువుల నుంచి వేధింపులు, నిరాదరణ పెరిగిపోతుండడంతో కేంద్రం 2007లో తల్లిదండ్రులు వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఒక ట్రిబ్యూనల్ ఏర్పాటైందని, ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్ అధికారి చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. బాధిత వృద్ధులకు ఉచితంగా వారి బిడ్డల నుంచి రక్షణ పోషణ కల్పిస్తారని చెప్పారు. బాధితులకు తీర్పు నచ్చకపోతే జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పడ్డ ట్రిబ్యూనల్‌ను 60 రోజుల్లో ఆశ్రయించి అంతిమ తీర్పుతో న్యాయం పొందవచ్చని సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షకుడు షేక్ మహబూబ్, పారా లీగల్ వాలంటీర్ బి. మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీని స్ఫూర్తిగా తీసుకోండి




స్వాతంత్రోద్యమ నాటికలో విద్యార్థులు

తెనాలిఅర్బన్: జాతి పిత మహాత్మాగాంధీజీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మోర్లే సూచించారు. గాంధీ జయంతిని బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో వచ్చి స్వాతంత్రోద్యమ ఘటాలను ప్రదర్శించారు. అవి ఎంతో ఆకట్టుకున్నాయి. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం రావాడానికి గాంధీజీ చేసిన పోరాటాలు మరువరానివన్నారు. శాంతి, అహింస సిద్ధాంతాలతో ఆయన ఉద్యమాలునడిపరాని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజయకుమారి, ఇన్‌చార్జి రేఖారాణి, శారద, సత్యశ్రీ, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉప్పుబజారులో ద్విచక్ర వాహనం అపహరణ

తెనాలిరూరల్: తెనాలిలో బైక్ దొంగలు మళ్లీ రెచ్చిపోతున్నారు. ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలను ఎంతో చాకచక్యంగా మాయం చేసేస్తున్నారు. పట్టణంలో ఓ అపార్ట్‌మెంట్ ముందు పార్క్ చేసిన పల్సర్ బైక్‌ను దొంగలు అపహరించుకు వెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. చెంచుపేటకు చెందిన షేక్ సుమన్ కారు హోల్డింగ్ డ్రైవర్ గా పని చేస్తుంటాడు. గత నెల 29వ తేదీ ఆదివారం రాత్రి గుంటూరు బాడుగకు వెళ్లేందుకు గాను తన మోటార్ బైక్‌ను ఉప్పు బజారులోని రామమందిరం వీధిలో కారు బాడుగకు పిలిచిన వారి అపార్ట్‌మెంట్ ముందు పార్క్ చేసి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయాక గుంటూరు నుండి తిరిగి వచ్చి చూసే సరికి తన బైక్ లేకపోవడంతో వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే అపార్ట్‌మెంట్ సమీపంలోని ఓ ఇంట్లో గల సిసి కెమేరాల్లో బైక్ చోరీ దృశ్యాలు రికార్డయ్యాయి. ఆదివారం రాత్రి 10.44 గంటల సమయంలో నడుచుకుంటూ వచ్చిన ఇద్దరు వ్యక్తులు బైక్ హ్యాండిల్ ను తొలగించి కాసేపు అక్కడక్కడే తిరగడం సీసీ కెమేరాల్లో రికార్డయ్యాయి. అనంతరం 10.48 గంటల సమయంలో బైక్‌ను నెట్టుకు వెళ్లడం కెమేరాల్లో నమోదైంది.

సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం



తెనాలిఅర్బన్: విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతారని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమోనాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరిపొట్ట దశలో జాగ్రత్తలు తీసుకోవాలి

కొల్లిపర: రైతులు మాగాణి భూమిలో పండిస్తున్న వరి పంట పొట్ట దశలో ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో కె.వెంకటరావు సూచించారు. మంగళవారం మండలంలోని చివలూరు గ్రామంలో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో గ్రామంలోని వరి పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతూ పొట్ట దశలో ఉన్న వరి పంటకు తప్పనిసరిగా మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ ఎకరానికి 20 కేజీలు చొప్పున వేయాలన్నారు. పాము పొడ తెగులు ఆశించినట్లయితే ఎకరానికి 300 మి.లీ హెక్సకోనజోల్ తెగులు మందు పిచికారీ చేయాలని, దోమ (బీపీహెచ్) ఆశించినట్లయితే పైమెట్రిజోన్ మందు 175గ్రాములు ఎకరానికి వాడాలని, అగ్గి తెగులు సోకినచో ట్రైసైక్లాజోల్ 120 గ్రాములు (బీమ్) ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. వరి సాగులో ఏమైన సమస్యలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించి వారు సూచించిన విధంగా మందులు వాడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆధిలక్ష్మి , రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



తెనాలి: భారతీయ స్టేట్ బ్యాంక్ బ్యాంకింగ్ కార్యకలాపాలతోపాటు సమాజసేవలోనూ భాగస్వామ్యం వహిస్తుందని ఆ బ్యాంకు రీజినల్ అధికారి వీవీ జగదీష్‌కుమార్ చెప్పారు. రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరంభించిన జూనియర్ ఇంటర్‌లోని 32 మంది విద్యార్థినులకు మంగళవారం ఆయన యూనిఫాంను పంపిణీ చేశారు. జూనియర్ ఇంటర్ విద్యార్థినులకు యూనిఫాం లేదని తెలిసీ తమ బ్యాంక్ ముందుకు వచ్చినట్టు తెలిపారు. అవకాశం ఇచ్చిన ప్రిన్సిపాల్ అనూరాధకు ధన్యవాదాలను తెలియజేశారు. సభకు ప్రిన్సిపాల్ అనూరాధ అధ్యక్షత వహించారు. బ్యాంక్ ప్రాంతీయ అధికరి ఎం.తిరుమలేశ్వరరావు, మార్కెటింగ్ కన్సల్టెంట్ సాయి లక్కరాజు తమ ప్రసంగాల్లో సమాజసేవలో స్టేట్‌బ్యాంకు ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. బ్యాంక్ తెనాలి ఉద్యోగుల జోనల్ కార్యదర్శి రావిపాటి ప్రేమకుమార్, అంగలకుదురు గ్రామస్తులు రావినూతల ప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు మూర్తి, షేక్ మాలి, రామకృష్ణ, హేమాదేవి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను తెరవకుండా సిబ్బంది నిరసన

ఉన్నతాధికారుల ఒత్తిడితో మధ్యాహ్నం మూడు గంటలకు తెరచిన వైనం



తెనాలి: ఐఎంఎల్ డిపో పరిధిలోని పలు వైన్ షాపులు మంగళవారం మూతపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వైన్ షాపుల్లో పనిచేసే సేల్స్‌మెన్‌లు, సూపర్‌వైజర్‌లు నిరసన తెలియజేశారు. డిపో పరిధిలోని మద్యం షాపులు మూసి వేసి తమ నిరసనను తెలియజేశారు. ఉద్యోగుల నిరసన కారణంగా పట్టణంలోని వైన్ షాపులు, మాల్స్‌తో పాటు పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, నందివెలుగు, కొలకలూరు గ్రామాల్లోని ప్రభుత్వ వైన్ షాపులు మూతపడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం మూడు గంటల వరకూ షాపులు మూసి వేసి తమ నిరసనను తెలియజేశారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో మూడు గంటల అనంతరం షాపులను యధావిధిగా తెరిచారు. తెనాలి డిపో కమిటీ అధ్యక్షుడు పినపాటి కొండలరాజు, పినపాటి వంశీ, అన్వేష్ , కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్, ధనరాజుపల్లి సురేష్, భాస్కర్, గోపి, టప్రకాష్, ఆనంద్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.